## జూనియర్ ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

షాబాద్, మే 18 : గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 2024-25 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కందుకూరు, మహేశ్వరం గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలురు, బాలికల కళాశాలలు రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల వారు ఇంటర్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ (ఎంఎల్‌టీ ఒకేషనల్ బాలికలకు మాత్రమే), (సీఈసీ/హెచ్ఈసీ బాలురుకు మాత్రమే) గ్రూపులకు మిగిలిన సీట్లకు 2023-24 సంవత్సరంలో పదో తరగతి పాస్ అయిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఈ నెల 23న బాలురు, 25న బాలికలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కౌన్సెలింగ్ రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్‌లోని మానస హిల్స్‌లో ఉన్న ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8333925367, 8466043108, 9490215948 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ఆర్టీఏ కార్యాలయ పరిసరాల్లో మొక్కలు పెంచండి

- జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్



ఆర్టీఏ కార్యాలయ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

షాద్‌నగర్‌టౌన్, మే 18: షాద్‌నగర్ ఆర్టీఏ కార్యాలయ పరిసరాల్లో మొక్కలను పెంచాలని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ సూచించారు. షాద్‌నగర్ ఆర్టీఏ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. ఆర్టీఏ కార్యాలయానికి సంబంధించి వివరాలతో పాటు ప్రజలకు అందుతున్న సేవలపై స్థానిక ఎంవీఐ వాసును అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. అలాగే కార్యాలయం పరిసరాల్లో పచ్చదనం కనిపించేలా మొక్కలను పెంచాలన్నారు.

## గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్టు సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 18 : మండల పరిధిలోని మజీద్‌పూర్‌కు చెందిన గీత కార్మికుడు గండేటి తేజ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన ఈ కార్మికుడి వివరాలను మోడెపు యాదగిరిగౌడ్ కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్టుకు తెలియజేశారు. స్పందించిన ట్రుస్టు సభ్యులు రూ.20వేల ఆర్థిక సాయాన్ని స్థానిక వలంటీర్లు శనివారం కార్మికుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం పెద్దలు ట్రస్టును అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు వలంటీర్లు పాండు, రాఘవేందర్, గణేశ్, యాదగిరిగౌడ్, అజయ్ కుమార్‌గౌడ్, గ్రామ గౌడసంఘం అధ్యక్షుడు మేడిపల్లి అంజయ్య, గీతా కార్మికులు నర్సింహ, దర్శన్, మల్లేశ్, రాములు, వెంకటేశ్, జగన్, జీ వెంకటేశ్, కే వెంకటేశ్, నగేశ్, శివశంకర్, నర్సింహ, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆరోపణలు సరికాదు

షాద్‌నగర్‌రూరల్, మే 18 : ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలో చేపడుతున్న మురుగు కాలువ పనులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన ఆరోపణలు సరికాదని ఎంపీటీసీ భీష్వ రామకృష్ణ అన్నారు. ఈ పనులను పరిశీలించిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మురుగు కాల్వలు వంకరటింకరగా ఉన్నాయని మాట్లాడడం సరికాదన్నారు. ఈ పనుల కోసం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకొని రూ.75లక్షలు మంజూరు చేశారని తెలిపారు. నేడు ఆ నిధులు రాకుండా కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో శశాంక్, లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

## కందవాడలో పంటల పరిశీలన



జొన్న పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారిణి తులసి

చేవెళ్ల రూరల్, మే 18 : మండల పరిధిలో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా పర్యటించి పంటలు పరిశీలిస్తున్నారు. శనివారం కందవాడ గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి తులసి జొన్న పంటలను పరిశీలించారు. జొన్న పండిస్తున్న రైతులతో మాట్లాడి.. పలు సలహాలు, సూచనలు చేశారు. ఏవో మాట్లాడుతూ.. రైతులు సస్య రక్షణ చర్యలు చేపడుతూ.. వ్యవసాయ శాఖ విధి, విధానాలను అవలంభిస్తూ సాగులో మెళకువలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఏవో వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారిణి స్వాతీప్రియ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను సంరక్షించాలి

యాచారం, మే18: మండలంలోని ప్రభుత్వ భూములకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన గొడుకొండ్ల ప్రవీణ్ శనివారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూముల వివరాలను ఆర్డీవోకు అందజేశాడు. నల్లవెల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 531, 567, మొండిగౌరెల్లిలోని సర్వే నంబర్ 68, 127లో గల ప్రభుత్వ భూములను కొంత మంది అక్రమార్కులు కబ్జాకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కబ్జాకు గురైన భూములను కాపాడి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## యాచారంలో ట్రా'ఫికర్'

యాచారం, మే18: మండల కేంద్రంలోని నందివనపర్తి రోడ్డులో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు రెట్టింపవుతున్నాయి. ప్రైవేటు వాహనాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ఒక్కోసారి కందుకూరు వెళ్లే రోడ్డులో పది నుంచి ఇరవై నిమిషాల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు వాహనాదారులపై పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవటంతోనే ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

మండలకేంద్రంలో కందుకూరు లింకు రోడ్డు ఉండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఫలితంగా ప్రయాణికులు, ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. మాల్ మార్కెట్‌లోనూ ఇదే సమస్య తలెత్తుతున్నది. ముఖ్యంగా మర్రిగూడ రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ ప్రైవేటు వాహనాలను నిలుపడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతున్నది.

# సమస్యలు పరిష్కరించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్ : మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, (తలకొండపల్లి) మే 18: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నిర్మల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. సభ ప్రారంభంకాగానే అధికారులు శాఖల వారీగా అజెండాను ప్రస్తావించారు. వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో సమస్యలను పరిష్కరించాలని, గ్రామాల్లో పాము, కుక్క కాటుకు గురైన వారికి మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విధుల నిర్వహణలో అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కేశవరెడ్డి, తహసీల్దార్ రంగారెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, ఎంఈవో సర్దార్‌నాయక్, ఏఈలు కతారియా, విద్యాసాగర్, వైద్యులు కల్పన, సైదమ్మ, ఏపీఎం శ్రీదేవి పాల్గొన్నారు.



కొత్తూరు : మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి

### అధికారులదే బాధ్యత

కొత్తూరు : గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే అని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఏకరవు పెట్టారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు తదితర సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచ్‌లు లేనందున ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు బాధ్యతలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం రూ.19 లక్షలు కేటాయించిందని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు రానివ్వొద్దని అధికారులకు తేల్చిచెప్పారు. ముఖ్యంగా పాఠశాలల్లో మౌలిక వసతుల ఇబ్బందులు ఉంటే తనకు తెలుపాలని సూచించారు. తాను సొంత నిధులు వెచ్చించి పాఠశాలల బాగుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శోభా లింగంనాయక్, ఎంపీడీవో అరుంధతి, ఎంపీటీసీలు జంగగళ్ల కృష్ణయ్య, రవీంద్‌రెడ్డి, డాక్యా, దేశాల అంజమ్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి



వాసవీ కన్యకా పరమేశ్వరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

యాచారం, మే18: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వీరబొమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ..ఆర్యవైశ్యులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలన్నారు. పేదరికంతో బాధ పడుతున్న ఆర్య వైశ్యులకు బ్యాంకు రుణాలను అందించాలన్నారు. కార్యక్రమంలో పొద్దుటూరి రవీందర్‌గుప్తా, మురళీకృష్ణ, సురేందర్, నరసింహ సంతోష్‌గుప్తా, లక్ష్మణ్, ప్రవీణ్, మనోహర్ తదితరులున్నారు.

**మంచాల :** వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మంచాల గ్రామంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, డోలారోహణం, కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా వాసవీ మాతా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు హనుమంతు, నాయకులు చంద్రమౌళి, బద్రినాథ్ గుప్త, కాచం శ్రీనివాస్, కాచం శాస్త్రితో పాటు తదితరులు పాల్గొన్నారు.



మంచాల : కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

## నేడు ఉచిత వైద్యశిబిరం

షాబాద్, మే 18: షాబాద్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాకేశ్‌శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్‌కు చెందిన జనని పిల్లలు, జనరల్, లాప్రోస్కోపిక్ దవాఖాన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఉచిత వైద్యశిబిరం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## యువతి అదృశ్యం



శీతల్ (ఫైల్)

పెద్దంబర్‌పేట్, మే 18 : ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాక పోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన అనాజ్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. మహారాష్ట్రకు చెందిన పతివేర్ దీపక్ కూలీ పని చేస్తూ మండల పరిధిలోని అనాజ్‌పూర్‌లో తన భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన కుమార్తె పతివేర్ శీతల్ (18) ఇంట్లో చెప్పకుండా వెళ్లింది. తెలిసిన వారి ఇండ్లల్లో తమ బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సునీల్‌కుమార్ తెలిపారు.

## వాటర్ ఫిల్టర్‌ను తొలగించాలి

కొత్తూరు, మే 18: చెరువు శిఖం భూమిని ఆక్రమించి నిర్మించిన వాటర్ ఫిల్టర్‌ను తొలగించాలని కొత్తూరు తండా వాసులు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి శనివారం ఫిర్యాదు చేశారు. సర్వోనికుంట (శాయిరెడ్డి చెరువు) శిఖం భూమిలో అక్రమంగా వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారని వారు వినతి పత్రం లో పేర్కొన్నారు. దీంతో పాటు ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 66లో అక్రమ నిర్మాణాలు వెలిశాయని తెలిపారు. డ్రైనేజీ నీరు కూడా చెరువులోకి వెళ్తుందని వారు వివరించారు. కార్యక్రమంలో రేడ్యానాయక్, రాజూనాయక్, రమేశ్, రవి, సరేందర్, గోపాల్, బాబు, రవీందర్ పాల్గొన్నారు.

# జోరు వాన.. రోడ్లు జలమయం



యాచారంలో కురుస్తున్న భారీ వర్షం

యాచారం, మే 18 : మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చిరు జల్లులతో మొదలైన వాన కుండపోతగా మారింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. కొత్తపల్లి, మాల్, యాచారం, మేడపల్లి తదితర గ్రామాల్లో ఇండ్లల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. మండలంలోని మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి, నజ్దిక్‌సింగారం, నందివనపర్తి, నానక్‌నగర్, మల్కీజ్‌గూడ, తాటిపర్తి, యాచారం, మాల్ తదితర గ్రామాల్లో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో విద్యుత్ లేక అంధకారం ఏర్పడింది. కారు చీకట్లతో మబ్బులు కమ్ముకుపోవడం, రోడ్లపై నీరు నిలువడంతో ప్రయాణికులు, వాహనదారులు నానా ఇక్కట్లు పడ్డారు. యాచారం, మాల్, గున్‌గల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. మొత్తంగా భారీ వర్షం కురవడంతో వాన కాలం పంటలను సాగుచేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. జోరుగా జొన్న, పత్తి, కంది తదితర పంటల విత్తనాలు వేయడం ఖాయంగా కనిపిస్తుంది.



చేవెళ్లరూరల్: అంతారంలోని 2వ వార్డు రోడ్డులో నిలిచిన వర్షం నీరు

### గ్రామాల్లో కురిసిన వర్షం

చేవెళ్ల రూరల్ : చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అంతారం, ఆలూర్ గ్రామాల్లో రోడ్లు దెబ్బ తిన్నాయి. దీంతో రోడ్లపై నీరు నిలవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

**మన్సూరాబాద్ :** భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చింతలకుంట నుంచి పనామా చౌరస్తాకు వెళ్లే మార్గంలోని కేఎల్‌ఎం షోరూం వద్ద రోడ్డుపై వరద నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీతో వరద నీటిని దారి మళ్లించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. అదేవిధంగా మన్సూరాబాద్ లోతట్టు కాలనీలు గణేశ్‌నగర్, శ్రీసాయినాథ్‌కాలనీ, మల్లికార్జుననగర్ నార్త్, ఆగమయ్యకాలనీ, హకీమాబాద్, కామినేని చౌరస్తా నుంచి మన్సూరాబాద్ చౌరస్తాకు వెళ్లే మార్గం, సెంట్రల్ బ్యాంకు కాలనీ, నాగోల్ డివిజన్ పరిధి ఆనంద్‌నగర్ చౌరస్తా, శ్రీనివాసకాలనీ, విజయగార్డెన్, బండ్లగూడ, అయ్యప్పకాలనీ, త్యాగరాయనగర్ కాలనీల్లోని రోడ్లపైకి వరదనీరు చేరడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



చింతలకుంట వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వరదనీటితో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



చింతలకుంట వద్ద ఉన్న కేఎల్‌ఎం షోరూం ఎదురుగా నిలిచిన వరదనీరు

## ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, మే 18 : అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని యాచారం పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ శంకర్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మాల్‌లో నాగార్జునసాగర్ రహదారిపై ఏర్పాటు చేసిన బార్డర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కడ్తాల్ మండల పరిధిలోని పల్లెచెల్కతండాకు చెందిన విస్లావత్ మోతీలాల్ తన బొలేరొ వాహనంలో మాల్ నుంచి యాచారం వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు.

అనుమానస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి, మోతీలాల్‌పై కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేసున్నారు.

## మురుగు.. పరుగు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మండల పరిషత్ కార్యాలయం వద్ద రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

కొత్తూరు, మే 18: ఎంపీడీవో కార్యాలయం ఎదుట మురుగు నీరు ఆరు నెలలుగా పొంగి పొర్లుతున్నది. దీంతో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 6 నెలలుగా మ్యాన్ హోల్ పొంగి పొర్లుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వెళ్లడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో పాటు వర్షం కూడా కురియడంతో మ్యాన్ మరింత పొంగింది. మ్యాన్‌హోల్ పొంగి రోడ్డపై వరద ఏరులై పారుతున్నది. సమస్యను వెంటనే పరిష్కరించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత




తోపుడు బండ్లు అందజేసిన జీఎంఆర్ సంస్థ, కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్

బడంగ్‌పేట, మే18: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన చిరు వ్యాపారులు తట్ట నెత్తిన పెట్టుకొని కూరగాయలు, పండ్లు అమ్ముతున్న వారిని గమనించి జీఎంఆర్ సంస్థ ద్వారా వారికి తోపుడు బండ్లు అందించే విధంగా కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ చొరవ తీసుకున్నారు. జీఎంఆర్ సంస్థ వారు ఆరుగురిని గుర్తించి ఆరు తోపుడు బండ్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్ యాతం పవన్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సేవా ధృక్పథం ఉంటే సమాజంలో మార్పు వస్తుందన్నారు. సహాయం చిన్నదా పెద్దదా కాదు.. ఎదుటి మనిషి కష్టాలను అర్థం చేసుకొని సహాయం చేసే గుణం ఉండాలన్నారు. పేద ప్రజలకు సహాయం చేయడానికి మరికొంత మంది ముందుకు రావాలన్నారు.